ప్రజాశక్తి

సోమవారం 27 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

గుంటూరు, నరసరావుపేటలో జాతీయ జెండాలకు వందనం చేస్తున్న కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, పి.అరుణ్‌బాబు, ఎస్పీలు

జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

గణతంత్ర దినోత్సవ సందేశాల్లో గుంటూరు, పల్నాడు కలెక్టర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, పల్నాడు జిల్లా

అధ్వానంగా ఉన్న రహదారులను మెరుగుపర్చేందుకు కృషి జరుగుతోందని గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, పి.అరుణ్‌బాబు చెప్పారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరులోని పోలీసు కవాతు మైదానంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం ఎస్ఎస్‌పి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జాతీయ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసు బలగాలు, ఎన్‌సిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గుంటూరు కలెక్టర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దేందుకు రూ.20.30 కోట్లతో 399 కిలో మీటర్ల రహదారులకు మరమ్మతులు చేస్తున్నామని వివరించారు. 165 కిలో మీటర్ల పరిధిలో ఇప్పటికే పనులు పూర్తయ్యాయని తెలిపారు. గుంటూరు నగరంలో శంకర్‌విలాస్ వద్ద ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి స్థానంలో నాలుగు లైన్ల బ్రిడ్జిని రూ.98 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన సర్వే పూర్తయిందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు గడ్డిపాడు రైల్వే గేటు వద్ద రూ.129 కోట్లతో ఒక ఆర్‌వోబి, శ్యామలనగర్ గేటు వద్ద రూ.147 కోట్లు, సంజీవయ్య నగర్ గేటు వద్ద రూ.120 కోట్లు, సీతానగర్ గేటు వద్ద రూ.140 కోట్లతో మరో ఆర్‌వోబి నిర్మించేందుకు రైల్వేశాఖకు ప్రతిపాదనలు పంపామన్నారు. గడ్డిపాడు వద్ద ఆర్‌వోబికి ఇప్పటికే కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో సర్వతోముఖాభివద్ధికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా 551 గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ సిస్టంలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4.24 కోట్ల సబ్సిడీ ఇచ్చిందన్నారు. జిల్లాలో ఉచిత ఇసుకను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఏడు స్టాక్ యార్డులు, 4 రీచ్‌ల ద్వారా ఇప్పటి వరకు 6.6 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేశామని తెలిపారు. 198 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. 62 గ్రామాల్లో రీ సర్వే గ్రామసభలను నిర్వహించామని, ప్రజల నుంచి 7,322 అర్జీలు రాగా వాటిల్లో 4,522 అర్జీలను పరిష్కరించామని తెలిపారు. మిగతా వాటిని మరో 10 రోజులలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 16,989 ఫిర్యాదులు రాగా వీటిల్లో 11,470 పరిష్కరించినట్టు

▶ 2లో

తాడేపల్లిలో ట్రాక్టర్ ర్యాలీ

పాలకుల మెడలు వంచుదాం

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షకుల ఆధ్వర్యంలో వాహన ర్యాలీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, తాడేపల్లి రూరల్

వ్యవసాయాన్ని దెబ్బతీసేలా, కార్మిక హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట, క్రోసూరు మండలం కేంద్రం, గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం కార్మిక, కర్షకులు నిరసనలు చేపట్టారు. ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు చేశారు. జాతీయ అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు జరిగిన ప్రదర్శనల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నాయకులు దుయ్యబట్టారు. వ్యవసాయ రంగంలో సంక్షోభానికి, రైతు ఆత్మహత్యలకు పాలకులే కారణమని ఉద్ఘాటించారు. ఐక్యపోరాటాల ద్వారా పాలకుల మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. నరసరావుపేటలో మార్కెట్ యార్డ్ నుండి మల్లమ్మ సెంటర్ మీదుగా స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వరకు భారీ ర్యాలీ జరిగింది. ఏపీ రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటానికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం హామీలిచ్చినా వాటిని అమలు చేయడం లేదని, పైగా దొడ్డిదారిన అదే చట్టాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారతదేశంలో రైతులు ఆత్మహత్యలు

▶ 2లో

నరసరావుపేటలో ర్యాలీ

రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న మోషెన్ రాజు, ఇతర నాయకులు

లౌకిక రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

చట్ట సభల్లో పిడిఎఫ్ కృషి అభినందనీయం - రాజ్యాంగంపై పుస్తకాల ఆవిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

కార్పొరేట్ శక్తులు, సనాతనవాదుల నుండి రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం రిజర్వేషన్లకు పరిమితం కాదని, దేశంలోని అన్ని మతాలు, ప్రాంతాలు, సంస్కృతులు, ప్రజలందరి హక్కులకు సంబంధించినదని ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగంపై ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన పుస్తకాల ఆవిష్కరణ సభ స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగింది. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో శాసన మండలి ఛైర్మన్ కె.మోషెన్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొని భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాణం-పీఠిక పుస్తకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఫొటోలతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవితం పుస్తకాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు అనే పుస్తకాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సమకాలిన వ్యాసాలు పుస్తకాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మస్తాన్‌వలి ఆవిష్కరించారు. తొలుత అంబేద్కర్, రాజ్యాంగం చిత్రపటాలకు మోషన్‌రాజు,

▶ 2లో

ఆకట్టుకున్న శకట, సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో వివిధ ప్రభుత్వ శాఖలలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరిస్తూ శకటాల ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, రైతులకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ శకటం ప్రదర్శించింది. మన పాఠశాల మన భవిష్యత్, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రా పథకం, విద్యాశాఖలో అమలు చేస్తున్న పథకాలపై విద్యా శాఖ, సమగ్ర శిక్ష శాఖ, క్యాన్సర్ స్క్రీనింగ్, హెచ్ ఎంపివి అవగాహన,108,104 సేవలపై జిల్లా వైద్యారోగ్యశాఖ, పిఎంఎవై, ఎన్‌టిఆర్ నగర్ ఇళ్ళ నిర్మాణంపై గృహనిర్మాణ సంస్థ, ఉన్నతి మహిళా శక్తి ఆటో,

▶ 2లో

గృహ నిర్మాణ శాఖ శకటం

గౌరవవందనం స్వీకరిస్తున్న గుంటూరు, పల్నాడు కలెక్టర్లు

జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. నల్లపాడు, బీబీనగర్ మధ్య ట్రాక్ డబ్లింగ్ పనులు, ఎర్రుబాలెం, నంబూరు మధ్యకూడా కొత్త ట్రాక్ వేయనున్నట్టు తెలిపారు. కొండమోడు పేరేచర్ల నాలుగు లైన్ల రహదారికి రూ.270 కోట్లతో పనులను మార్చిలో ప్రారంభిస్తామన్నారు. ఎయిమ్స్ ఆస్పత్రికి రూ.7.7 కోట్లతో తాగునీని అందించినట్టు తెలిపారు. వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, జెసి ఎ.భార్గవ్‌తేజ, ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు , అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, అడిషనల్ ఎస్పీ సుప్రజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి పాల్గొన్నారు. నరసరావుపేట వేడుకల్లో పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. పల్నాడు కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ దనుంజయ్ గనోరేలు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. జిల్లా రెవిన్యూ అధికారి మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. పలు కార్యాలయాల్లో డీఎస్పీ కె.నాగేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ చరణ్, టూటౌన్ సిఐ హైమారావు, రూరల్ సిఐ పి.రామకృష్ణ త్రివర్ణ పతకాలను ఆవిష్కరించారు. ఎస్ఐలు లేఖ ప్రియాంక, అశోక్, కిషోర్ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో శకట, సాంస్కృతిక ప్రదర్శనలు

పాలకుల మెడలు వంచుదాం

తాడేపల్లిలో బైక్ ర్యాలీ

నరసరావుపేట, క్రోసూరులో వాహనర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతున్నాయని, ఇందుకు పాలక పక్షాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు రైతులు నష్టాల పాలవుతుండగా మరోవైపు విత్తన, ఎరువుల కంపెనీలు మాత్రం లాభాలు ఆర్జిస్తున్నాయని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు దేశ ప్రజలకు నష్టమని, బడా పెట్టుబడి దారులకు, కాంట్రాక్టర్లకు లాభమని వివరించారు.న్నారు. రైతుసంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాము, ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాషా, కార్మిక సంఘాల నాయకులు ఎస్.ఆంజనేయ నాయక్, కాసా రాంబాబు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, కిసాన్ మహాసభ నాయకులు టి.ఆంజనేయులు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, షేక్ హుస్సేన్ తదితరులు మాట్లాడుతూ దేశానికి పట్టెడన్నం పెట్టె రైతుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేందుకేనని మండిపడ్డారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని 57 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జగ్జిత్‌సింగ్ దల్లేవాల్‌కు ఏమైనా జరిగితే కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, ఎ.మారుతి వరప్రసాద్, నాయకులు హనుమంతరెడ్డి, సిలార్ మసూద్, జి.బాలకృష్ణ, కె.రామారావు, మల్లీశ్వరి, వి.వెంకట్, సైదా రంగయ్య పాల్గొన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటర్ వద్ద నుండి గాంధీ బొమ్మల సెంటర్ వరకు బైక్ ర్యాలీ చేశారు. కౌలురైతు సంఘం జిల్లా నాయకులు టి.హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం అచ్చంపేట మండల కార్యదర్శి కె.గోపికృష్ణారెడ్డి, రైతుసంఘం నాయకులు కె.పెద్దబ్బాయి, ఎ.ఆంజనేయులు మాట్లాడారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద నుండి ఉండవల్లి సెంటర్, తాడేపల్లి, కొత్తూరు జాతీయ రహదారి వైపు నుండి కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లంపూడి, గుండిమెడ, ప్రాతూరు, కుంచనపల్లి గ్రామాల్లో ట్రాక్టర్లు, బైక్‌లతో భారీ ర్యాలీ చేశారు. ర్యాలీని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టాలు చేస్తుందని మండిపడ్డారు. వెంటనే మద్దతు ధర చట్టం తీసుకురావాలని, నూతన మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ విధాన ముసాయిదాను తిరస్కరిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలన్నారు.

లౌకిక రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇతర నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. మోషెన్‌రాజు మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లటానికి కెఎస్ లక్ష్మణరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వ్యక్తిగత దూషణలు కోసం కాకుండా కెఎస్ లక్ష్మణరావు ఇతర పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వారిని ఎన్నుకున్న వారి సమస్యల పరిష్కారానికి, పేదల సమస్యలపై మండలిలో వేదికగా కృషి చేస్తారని, అటువంటి వారు చట్టసభల్లో ఉండాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా కెఎస్ లక్ష్మణరావు వంటి వారిని బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంపై దేశంలో చర్చ జరుగుతున్న ఈ తరుణంలో రాజ్యాంగం గొప్పతనాన్ని, ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో శ్రమకోర్చి విలువైన పుస్తకాలను రూపొందించిన లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు. ప్రజల కోసం, ప్రజల చేత రూపొందించుకున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో 3వేల సంవత్సరాల నాటి మనువాదాన్ని రుద్దటానికి కుట్ర జరుగుతోందని, కార్పొరేట్ శక్తులు, సనాతన వాదులు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని, వారి కుట్రలను లౌకిక, ప్రజాస్వామ్యవాదులు ఏకతాటిపైకి వచ్చి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం అంటే నమ్మకం లేని వారు పాలిస్తున్న తరుణంలో ఇటువంటి పుస్తకాలు ఇంకా విస్తృతంగా రావాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగానికి పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవటానికి లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలన్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో భిన్న మతాలు, సంస్కృతు లున్నా అందరూ ఐక్యంగా జీవించటం వల్లే ఇంత కాలం రాజ్యాంగం మనగలుగుతోందన్నారు. రాజ్యాంగ లక్ష్యాలపై తీవ్రమైన దాడి జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించటానికే ఈ పుస్తకాలు రాసినట్లు చెప్పారు. అనంతరం మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మస్తాన్‌వలి ప్రసంగించారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఇ.వి.నారాయణ, కన్నా విద్యాసంస్థల అధినేత కన్నా మాస్టారు, జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు అవధానుల హరి, విశ్లేషకులు పి.మల్లికార్జునరావు, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, విజిఎస్ పబ్లిషర్స్ అధినేత రామారావుకు మోషెన్‌రాజు, కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకుల ద్వారా జ్ఞాపికలు అందచేశారు. తొలుత కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వైస్‌ప్రెసిడెంట్ కె.అలీన్ రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, గాయకుడు పివి.రమణ గేయాలు అలరించాయి.

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు..

ఆకట్టుకున్న శకట, సాంస్కృతిక ప్రదర్శనలు

(మొదటి పేజీ తరువాయి)

రూఫ్ టాప్ సోలార్, డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలపై డీఆర్డీఏ- వెలుగు పథకం శాఖ, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ స్వర్ణ గ్రామాల సాధన పై జిల్లా పంచాయితీ రాజ్, గ్రామీణాభివద్ది శాఖ, దీపం-2 పథకం, మద్దతు ధరకు దాన్యం కొనుగోలు, స్వచ్ఛతా హీ సేవాపై గుంటూరు నగరపాలక సంస్థ, రహదారి భద్రతా నిబంధనలపై జిల్లా రవాణాశాఖ, సక్షమ్ అంగన్ వాడీ ఫౌండేషన్ స్కూలు ఇతర కార్యక్రమాలపై జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, అగ్నిప్రమాదాల నివారణ, విపత్తుల సహాయ చర్యలకు వినియోగించే అత్యాధునిక సామగ్రి పై రాష్ట్రవిపత్తుల స్పందన అగ్నిమాపక సేవల శాఖలు శకటాలు ప్రదర్శించాయి. శకటాల పెరేడ్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పరిశీలించారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు కాట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కీర్తిస్తూ, దేశభక్తిని చాటేలా కొనసాగాయి. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఇంగ్గిష్ మీడియం ఉన్నత పాఠశాల, సెయింట్ జోసఫ్స ఇంగ్లిషు మీడియం స్కూలు, సెయింట్ లారెన్స్ ఇంగ్లిషుమీడియం స్కూలు, ఆక్స్ ఫర్డ్ హైస్కూలు, ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. పోలీస్ శాఖ డాగ్ షో, మహిళా మీకోసం - మీ సంరక్షణే మా సంకల్పం స్కిట్‌లు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కు మొదటి బహుమతి, సెయింట్ లారెన్స్ పబ్లిక్ స్కూల్‌కు ద్వితీయ బహుమతి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు తృతీయ బహుమతిని కలెక్టర్ ప్రదానం చేశారు. శకటాల ప్రదర్శనలో జిల్లా విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ మొదటి బహుమతి, గుంటూరు నగరపాలక సంస్థ కు ద్వితీయ బహుమతి, గృహనిర్మాణ సంస్థకు తృతీయ బహుమతి సాధించాయి. ప్రభుత్వ శాఖలలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు. జిల్లాలోని స్వాతంత్ర్య సమరయోదులు, అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. స్వాతంత్ర్య సమర యోధులు అనుమోలు సూరయ్యకు రెండు సెంట్ల ఇంటి నివేశ స్థలం పట్టాను అందించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రఫీక్, డివిజనల్ పౌర సంబంధాల అధికారి జే.శ్యామ్ కుమార్, టైపిస్ట్ సిహెచ్. శివరామక్రిష్ణ లకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

దొంగలంటూ గిరిజనులను అరెస్టు చేయడం అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని గండాలయ్య పేటలోని ఎస్టీ కాలనీ గిరిజనులను దొంగలు అంటూ పోలీసులు అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. ఎవరో ఇద్దరు చేసిన తప్పులకు కష్టపడి పనిచేసుకునే పేద ప్రజలను పోలీసులు అరెస్టులు చేసి ఇబ్బందులకు గురి చేయడాన్ని విమర్శించారు. మంగళగిరి పానకాల స్వామి గండాలయ్య పేట నాలుగో వార్డ్ ఎస్టి గిరిజనులు యానాదులను దొంగలు అంటూ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో రాచూరి వేణు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముందుగా మాజీ కౌన్సిలర్ తుపాకుల సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళు లర్పించారు. ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న రాజ్యాంగం అమలు చేసుకుంటున్న ఈ రోజుల్లో జై భీమ్ సినిమా తరహాలో పేద గిరిజనులను చదువుకునే విద్యార్థులను దొంగల పేరుతో పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్న తీరుని ప్రజాస్వామ్య వాదులు, మేధావి వర్గం తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఎన్నికల్లో పేద ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చి గెలిచిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో పేద ప్రజలపై జరుతున్న సంఘటనలు పోలీసుల తీరుపై వెంటనే స్పందించాలని అన్నారు. మంగళగిరి పట్టణ సిపిఎం కార్యదర్శి వీసం జవహర్‌లాల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని గిరిజనులు 50 సంవత్సరాలుగా నీతి నిజాయితీతో కష్టపడి జీవనం సాగిస్తున్నారన్నారు. నిజాయితీగా ఉండే గిరిజన వ్యక్తి తుపాకుల సుబ్బారావని స్థానికులు కౌన్సిలర్‌గా మూడుసార్లు గెలిపించుకున్నా విషయాన్ని వారు గుర్తు చేశారు. సిపిఎం కంచుకోటలో నివసిస్తున్న గిరిజన ప్రజలు నీతి నిజాయితీతో ఉంటూ కష్టపడి జీవనం సాగిస్తారే తప్ప దొంగతనాలు చేసుకోవాల్సిన అవసరం వారికి లేదని అన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వ అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించామని అన్నారు. నిజమైన దొంగలను అరెస్టు చేసేందుకు సిపిఎంగా పోలీసులకు సహకరిస్తామని చెప్పారు. ఇద్దరు చేసిన తప్పులకు స్థానిక ప్రజలు దొంగలు అంటూ అందరిని అరెస్టు చేసి కొట్టడం వారిని ఇబ్బందులకు గురి చేయటం సరికాదని హితవు పలికారు. పేద ప్రజలకు అన్యాయం జరిగితే సిపిఎం అండగా నిలిచి పోరాడుతామని చెప్పారు. అనంతరం గండాలయ్య పేట నుండి మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు గిరిజన ప్రజలు ర్యాలీ నిర్వహించి పట్టణ ఎస్ఐ మహేష్ నాయక్ తో సిపిఎం నాయకులు జరుగుతున్న సంఘటనలపై చర్చించారు. సభలో సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం నాయకులు ఎం బాలాజీ మహాలక్ష్మి, ఎస్ గణేష్,ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎస్ఎస్ చంగయ్య

దళితులకాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న పాశం రామారావు బృందం

దళితవాడలో సమస్యలను పరిష్కరించాలి

వరగాని ఎస్సీకాలనీలో వ్య.కా.స బృందానికి కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి- పెదనందిపాడు

మండలంలోని వరగాని ఎస్సీ కాలనీలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు బృందం సర్వే చేపట్టారు. సర్వేలు పలు సమస్యలను కాలనీ వాసులు నాయకులకు తెలిపారు. కాలనీలో 350 ఎస్సీ కుటుంబాలకు నివాసముంటున్నారని, వీరిలో 100 మందికి పక్కా ఇళ్లు లేవన్నారు. రేకుల ఇళ్లు, పూరిగుడిసెల్లో జీవిస్తున్నారని తెలిపారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. ప్రధానంగా శ్మశాన సమస్య తీవ్రంగా ఉందని, స్థలం చాలటం లేదని, రెండు ఎకరాలు కొనుగోలు చేసి స్మశానానికి కేటాయించి, ప్రహరి నిర్మించి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని తెలిపారు. ఉపాధిపనులు వందరోజులు కల్పించాలని కోరారు. కాలనీలో వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు నూటికి 90శాతం ఉన్నారని, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. తల్లికి వందనం పథకం అమలు చేయాలని పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడారు. దళిత కాలనీలో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళదామన్నారు. ముందుగా తహశీల్దార్‌కు వినతి పత్రం ఇద్దామని, అనంతరం జిల్లాకలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి రమేష్‌బాబు, రైతు సంఘం నాయకులు జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు మంత్రి మనోహర్ పరామర్శ

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్యాస్ సిలెండర్ పేలిన ఘటనలో కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం శోభనాద్రిపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ 24 వ తేది శుక్రవారం రాత్రి గ్రామంలో ప్రమాదవశాత్తో జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది గాయపడగా, అందులో ఏడుగురిని మెరుగైన వైద్య సేవలు అందించడానికి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారని ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి మూడు సంవత్సరాల బాలుడు మృతి చెందడం పై మంత్రి విచారం వ్యక్తం చేశారు. 80 శాతం కాలిన గాయాలతో ఐసియులో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా వుందని, మిగిలిన నలుగురికి 50 నుండి 60 శాతం కాలిన గాయాలు అయ్యాయన్నారు. వీరి కుటుంబాలను పరామర్శించి పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. వీరంతా రోజు వారి కూలి చేసుకొని జీవించే నిరుపేదలని, జరిగిన సంఘటన చాలా బాధాకరమన్నారు. ఖచ్చితంగా ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏలూరు , గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు శ్రమిస్తున్నారన్నారు. గుంటూరు జీజీహెచ్ లో బర్నింగ్ వార్డు లేకపోవడం ఖచ్చితంగా ఒక లోటేనని , బర్నింగ్ వార్డు ఆవశ్యకత ఎంతైనా వుందని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు అందరూ ఈ విషయమై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. జీజీహెచ్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా , రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా మంచి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె.శ్రీనివాస రావు , డియం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి , జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యస్.యస్.వి.రమణ , గుంటూరు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వేంకటేశ్వర రావు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ ఈశ్వర్

మార్తా గ్రూప్ ఆఫ్ నర్సింగ్ సంస్థల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి : మార్త గ్రూప్ ఆఫ్ నర్సింగ్ విద్యాసంస్థల్లో 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ యనమల ఈశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్తల విజ్ఞత, వారు నిర్దేశించిన మార్గదర్శకాలతో మన దేశంలో ప్రజాస్వామ్యం పరిడవిల్లుతోం దన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీకి నాయకత్వం వహించి, దానిని ఖరారు చేయడంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ఎల్లవేళలా స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ పి. ఆదిలక్ష్మి, అడ్మినిస్ట్రేటర్ సి.హెచ్. కమలాకర్, నర్సింగ్ ట్యూటర్ నిర్మల కుమారి, రాజేశ్వరి, అకౌంటెంట్ దేవర్ధనరావు, ఎస్ రాజేష్, తెనాలి జి జి హెచ్ టిబి సూపర్వైజర్ రవికుమార్, దారా చంద్రకాంత్ పాల్గున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం బాలికల గురుకుల పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో పెదకూరపాడు మండలం లగడపాడు కు చెందిన వేమవరపు ఫణింద్ర, సత్తెనపల్లి మండలం గోరంట్లకు చెందిన నందిగం ఏలియా , నందిగం సిద్దులు తీవ్రంగా గాయపడ్డారు. ఫణీంద్ర సత్తనపల్లి మండలం రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలో పదో తరగతి, ఏలియా అమరావతిలో ఐటిఐ చదువుతుండగా సిద్దు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఫణీంద్రపుట్టినరోజు కావడంతో అతని స్నేహితులైన ఏలియా, సిద్దులు ద్విచక్ర వాహనంపై గురుకుల పాఠశాల దగ్గరికి వచ్చారు. ప్రిన్సిపల్ పర్మిషన్ తీసుకున్న ఫణీంద్ర స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వస్తుండగా సత్తెనపల్లి నుండి మిర్చిలోడుతో గుంటూరు వెళుతున్న ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఫణీంద్ర, ఏలియాల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు .రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తాడేపల్లి తహశీల్దార్‌కు బెస్ట్ ఆఫీసర్ అవార్డు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

తాడేపల్లి మండల తాసిల్దారుగా పనిచేస్తున్న డి సీతారామయ్య బెస్ట్ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ చేతుల మీదుగా శనివారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రం లో 15వ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని, ఈ అవార్డు అందు కున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్క రించుకొని తాడేపల్లి పట్టణ పరిధిలోని తాసిల్దార్ కార్యాలయంలో, అభినందన సభ ఏర్పాటు చేసి, తాసిల్దార్ సీతారామయ్యను మండల అధికారులు శాలువాను కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల ఉప తాసిల్దార్ రిజ్వాన, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కొమ్మ వేదాంతరావు, మండల సర్వేయర్ రవితేజ, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వృత్తిదారుల సమస్యలపై కడవరకూ పోరాటం

మోర్తోట సుబ్బారావు సంస్మరణ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రజకవృత్తిదారుల సమస్యలపై కడవరకూ పోరాటం చేసిన ధన్యజీవి నాయకులు మోర్తోట సుబ్బారావు అని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ వద్ద సుబ్బారావు సంస్మరణ సభ వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సుబ్బారావు చిత్రపటానికి పలువురు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్మరణ సభలో భాస్కరయ్య మాట్లాడుతు అమరజీవి చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేయి ంచి, రజక కుటుం బాలకు ఉపయోగపడే విధంగా అందరూ ఐక్యంగా కృషి చేయ డమే మోర్తోట సుబ్బా రావుకు నిజమైన నివాళి అని అన్నారు. రజక వృత్తిదారుల సమస్యల పైన నిరం తరం అలుపెరగని పోరాటం చేసిన సుబ్బారావు జనవరి 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం సంఘానికి తీరని లోటని అన్నారు. రజక సంఘం ఇచ్చిన ప్రతి పిలుపులోను, పోరాటంలోనూ సుబ్బారావు పాత్ర మరువలేనిదని ఆయన అన్నారు. రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్రకుల పెత్తందారులు, దౌర్జన్యాలను, అంటరానితనం రజక కుటుంబాలపై పడకుండా వృత్తిదారులను కాపాడే వారిని అన్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ఈమని రామారావు, జిల్లా అధ్యక్షులు మండూరు వెంకట నరసయ్య, అపార్ట్మెంట్ వాచ్మెన్ కం ఇస్త్రీదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసరావు, మంగళగిరి తాడేపల్లి నగం సంఘం అధ్యక్షులు ఉండవల్లి పార్థసారథి, తాడేపల్లి సాంబశివరావు, తెనాలి రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి పనితపు కోటేశ్వరరావు, కొత్తపల్లి వీరాంజనేయులు, తుమ్మపూడి శివయ్య, కొత్తపల్లి శ్యామ్, కొండాయిగుంట యానాది రావు, ధరణికోట వీరాంజనేయులు, సర్వేపల్లి శివయ్య, గుంటూరు నగర అధ్యక్ష కార్యదర్శులు బెండ ఎం కైలాసం, పేరుపాలెం రాంబాబు, సుబ్రహ్మణ్యం, మొర తోట శ్రీనివాసరావు, పోతార లంక శివశంకరరావు, బొజ్జ సుబ్బారావు పాల్గొన్నారు.

సుబ్బారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న భాస్కరయ్య, హాజరైన వృత్తిసంఘాల నాయకులు, రజకులు

చంబల్‌లోయగా మార్చిన బొల్లా : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ : నియోజవర్గాన్ని చంబల్‌లోయగా మార్చిన బొల్లా బ్రహ్మనాయుడు ఇప్పుడు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎద్దేవ చేశారు. బ్రహ్మనాయుడు శనివారం చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ రైతులపై హత్యాయత్నం కేసులు పెట్టారన్నారు. పిఎస్ ఖాన్ అనుచరులైన రషీద్, జిలానీకు గొడవవస్తే జిలానీ ఇంటిమీద పడ్డారని, జిలానీ లేకపోవడంతో సోదరుడు జింజానీని కొట్టారని, సామాను ధ్వంసంతోపాటు బుల్లెట్‌బైక్‌ను కాల్చారని అన్నారు. అయినా వారిపై కేసు పెట్టనీయలేదని ఆరోపించారు. ఆ రోజు సరైన చర్యలు తీసుకుంటే రషీద్ చనిపోయేవాడా? జిలానీ జైలుకు పోయేవాడా అని ప్రశ్నించారు. వల్లెపు శేషమ్మ అనే మహిళను బతికుండగానే చనిపోయినట్లు రికార్డుల్లో రాసేసి పింఛను తీసేశారని, 70 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం చేసిన పట్టించుకోలేదని, ఎంతో మంది టిడిపి కార్యకర్తలను తప్పుడు కేసులతో జైలుకు పంపారని విమర్శించారు. నరసరావుపేటలో ఏబీఎం ఆస్తులను అక్రమంగా ఎందుకు కొన్నారని, వినుకొండలోనూ కొనాలని చూసినా కుదరక బురద జల్లుతున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే ఆ భూములను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న హాస్పిటల్ డైరెక్టర్ కంజుల కోటిరెడ్డి

110 మందికి కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్ ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : గణతంత్ర దినోత్సవం సందర్భంగా నరసరావుపేట పట్టణం గుంటూరు రోడ్డులోని కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 225 మందికి వినికిడి, చెవి, గొంతు నొప్పికి సంబంధించిన పరీక్షలు చేసి మందులు అందించారు. 110 మందికి ఎండోస్కోపి, 90 మందికి వినికిడి పరీక్షలు, 25 మందికి తల తిరగడం వంటి రుగ్మతలకు పరీక్షలు చేశారు. వినికిడి యంత్రాలు అవసరమైన 10 మందికి 30 శాతం రాయితీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత, రెడ్‌క్రాస్ పల్నాడు జిల్లా ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 26 ఏళ్లుగా సామాజిక స్పృహతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు వర్షిణి, భూలక్ష్మీ, నాగేశ్వరరావు, విష్ణురాజ్, సుధీర్ చంద్ర, కోటేశ్వరరావు, రవికుమార్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వలి, మేనేజర్ మహేష్, ఫార్మసిస్ట్ స్వామి పాల్గొన్నారు.

ఆర్‌ఎంపి, పిఎంపిలకు శిక్షణ

ప్రజాశక్తి నకరికల్లు : మండలంలోని ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యులకు నరసరావుపేట సుప్రజా హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం సిఎంఇ క్లాసులను నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ గంగూరి సుప్రజ, అంకాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి రవితేజ మాట్లాడుతూ చిన్నపిల్లలు, పెద్దవారు, మధ్య వయసు వారిలో వచ్చే ఫిట్స్ రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు, పురుషుల్లో అధికంగా వచ్చే క్యాన్సర్ కారకాలు, నివారణ మార్గాలు, టీకాల గురించి వివరించారు. అనంతరం ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి షేక్ సైదా, ఆరేటి నాగేశ్వరావు, చెన్నారెడ్డి, ఎస్ఎస్ వీరాంజనేయులు, వెంకటరావు, గోపి పాల్గొన్నారు.

ఊరూవాడా ఘనంగా గణతంత్రం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. గ్రామాలు, పట్టణాల్లో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. విద్యార్థులు పలుచోట్ల దేశ భక్తిని ప్రబోధించే తమ సాంస్కృతిక ప్రదర్శనలతో అబ్బురపరిచారు. ఇందులో భాగంగా నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎమ్మెల్యే డాక్టర్ చదాల అరవిందబాబు ఆవిష్కరించగా ఎంపిడిఒ టివి.కృష్ణకు మారి, టిడిపి నాయకులు వి.రవి, జి.అంకమ్మ చౌదరి పాల్గొన్నారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర, చేసిన త్యాగాలు యువత తెలుసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, కోసూరి వీరరాఘవులు పాల్గొన్నారు. కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జెండాను స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ఎగురవేశారు. రాజ్యాంగం అమలు గురించి వివరించారు. ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పి.హేమంత్, హేమ పాల్గొన్నారు. ఎఎం రెడ్డి మెమెరియల్ కళాశాలలో కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఎంఎఎం కళాశాలలో కళాశాల ఛైర్మన్ ఎం.రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు, ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఛైర్మన్ షేక్ మీరావలి, తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నారాయణ, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావులు త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. టిడిపి జిల్లా కార్యాలయంలో వేడుకల్లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కార్యాలయం వద్ద జెండాను డిపో అధ్యక్షులు కన్నెగంటి రామారావు ఆవిష్కరించారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ మాట్లాడారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దెబ్బతిస్తోం దన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనే యులు నాయక్, నాయకులు డి.శివకుమారి, సిలార్ మసూద్, పి.వెంకటేశ్వర్లు, జి.మల్లేశ్వరి, కోటేశ్వరరావు, లలిత ప్రసాద్, కృష్ణ, మస్తాన్‌రావు, డి.సుభాష్ చంద్రబోస్, కె.కోటేశ్వరరావు, కె.యోహాన్ పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి - వినుకొండ : జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు న్యాయమూర్తి ఎం.మహతి జెండా ఆవిష్కరించారు. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామిక విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దేశం ప్రజాస్వామ్య, లౌకిక గణతంత్ర రాజ్యాంగా అవతరించడానికి రాజ్యాంగామే కారణమని చెప్పారు. రాజ్యాంగాన్ని రూపొందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలోని కమిటీ అపురూపమైన పునాదిని వేసిందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెఎస్ఎంవి నాయుడు, సెక్రటరీ పఠాన్ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు, జాయింట్ సెక్రటరీ యలవర్తి శ్రీనివాసరావు, కోశాధికారి చీమకుర్తి బ్రహ్మం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దండే వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, గుమస్తాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల : అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తహసీల్దార్ కిరణ్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకొని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిఐ ప్రభాకర్‌రావు, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ ఆఫీజ్ బాషా, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఉదయభాను, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఫణీంద్రనాయక్ జెండాలను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : మున్సిపల్ ఛైర్మన్ కొత్త చినసుబ్బారావు, కమిషనర్ పర్వతినేని శ్రీధర్, తహసీల్దార్ జె.మధుబాబు, పట్టణ సిఐ వెంకట్రావ్ ఆయా కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్, టౌన్ : పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్, తహశీల్దార్ కె.చక్రవర్తి, ఎంపిడిఒ బి.శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి శివారెడ్డి, ఏవో శ్రీధర్‌రెడ్డి రైల్వే స్టేషన్ సూపర్నెంట్ వెంకటరెడ్డి, పోస్టుమాస్టర్ కె.వెంకటేశ్వరరావు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రవితో సిఐ పి.శ్రీనివాసరావు చేత జాతీయ జెండాను ఆవిష్కరింపజేశారు. హోలీ ఫ్యామిలీ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు చరితరెడ్డి డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెన్స్, షటిల్‌పోటీలను నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు అచ్చిరెడ్డి సుదర్శన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రముఖ న్యాయవాది బుగ్గి నరసింహారావు నరసరావుపేటలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు నుండి ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అవార్డును అందుకున్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షులు జక్కుల లక్ష్మీనారాయణ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వా సుపత్రిలో బాలింతలు, గర్భిణులకు రొట్టెలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో జెండాను నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్క చంద్రపాల్ ఆవిష్కరించారు. జ్ఞాన్‌రాజ్‌పాల్, ఎం.వేదాద్రి, చాంద్‌బాష, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి : దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడం కోసం రాజ్యాంగాన్ని మార్చాలయని యత్నిస్తోందని విమర్శించారు. నాయకులు బి.సూరిబాబు, డి.ప్రసాదు, టి.సూరిబాబు, ఎం.శ్యామల, ఎస్.రాజకుమార్, మురారి, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిపౌత్ : మాచర్లలోని మానసిక వికలాంగుల పాఠశాలలో ఎక్సైజ్ సీఐ వెంకటరమణ జెండాను ఆవిష్కరించారు. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుండాల సైదులు పాల్గొన్నారు.

నిషేధం సాకుతో అధిక ధరలకు మద్యం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గణతంత్ర దినోత్సవం రోజున మద్యం, మాంసం అమ్మకాలపై నిషేధం ఉన్నా ఆ నిబంధనలేవీ పిడుగురాళ్ల పట్టణం, మండలంలో అమలు కాలేదు. మద్యం విక్రయాల జోరు కొనసాగడం ఒకెత్తయితే నిబంధనల సాకుతో ఒక్కో బాటిల్‌కు రూ.60-70 పెంచి అధిక ధరలకు విక్రయించారు. గ్రామాల్లోని మద్యం దుకాణాల పక్కనే ఉన్న గదుల్లో మద్యాన్ని అందుబాటులో ఉంచి అమ్ముకున్నారు. తుమ్మల చెరువు చెట్టు వద్ద ఉన్న మద్యం దుకాణానికి అనుకొని ఉన్న గదిలో కొందరు వ్యక్తులు మద్యం అమ్ముకోగా పిడుగురాళ్ల పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లలోనూ చాటుమాటుగా అమ్ముకున్నారు. వీటి నుండి మద్యాన్ని కొందరు తీసుకెళ్లి కొద్ది దూరంలోని దుకాణాల్లో పెట్టి అమ్ముకున్నారు. పట్టణ పరిధిలోని కొన్ని దుకాణాల్లో మాంసం విక్రయాలను అధికారులు నిలిపేయించినా గ్రామాల్లో కొనసాగాయి.

మహిళా దృక్కోణంలో నాటకాలు రాయాలి : ఓల్గా

ప్రజాశక్తి - యద్దపాడు

సామాజిక మార్పులో మహిళల పాత్రను దృష్టిలో పెట్టుకుని నాటకాలు రాయాలని రచయితలకు ప్రముఖ రచయిత్రి ఓల్గా పిలుపునిచ్చారు. 'తెలుగు నాటకం స్త్రీ వాదం' అంశంపై మండల కేంద్రమైన యద్దపాడులో కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు నాటక పరిషత్తుల సమూహం 'వేదిక' సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు జరిగింది. కార్యక్రమానికి 'వేదిక' అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఓల్గా మాట్లాడుతూ మహిళల మీద లైంగిక దాడులు, మాతృత్వపు ఆరాటపు సమస్యలు, శ్రమైక జీవనంలో మహిళల పాత్ర.. తదితర అంశాలను అధ్యయనం చేసి సృజనాత్మకంగా రాయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధనలు చేసి రాసిన నాటకాల కోసం సమాజం ఎదురు చూస్తోందని చెప్పారు. మూడు విడతలుగా జరిగిన సదస్సులో తొలుత వల్లూరి శివప్రసాద్ స్వాగతోపన్యాసం చేయగా 'వేదిక' కార్యదర్శి జేవీ మోహన్‌రావు వందన సమర్పణ చేశారు. రెండో విడత సదస్సుకు అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహించగా కందిమళ్ల సాంబశివరావు, నిభానుపూడి సుబ్బరాజు, సిహెచ్ సుశీలమ్మ మాట్లాడారు. మూడో సదస్సుకు పిన్నమనేని మత్యుంజయరావు అధ్యక్షత వహించగా పీవీ దేవి, నల్లూరి రుక్మిణి, జె.కనకదుర్గ మాట్లాడి పత్రాలు సమర్పించారు.

సదస్సులో మాట్లాడుతున్న ఓల్గా

కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై నిరసన

పెదనందిపాడులో

తుళ్లూరులో

దుగ్గిరాలలో

పెదకాకానిలో

ప్రజాశక్తి - పెదనందిపాడు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితంగా, వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి వెళుతుందని, దీంతో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు తెలిపారు. ఆదివారం రైతు సంఘాల అఖిలపక్షం దేశవ్యాప్త పిలుపులో భాగంగా పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. రైతుసంఘం నాయకులు కె వెంకట శివరావు అధ్యక్షతన కార్యక్రమంలో రామారావు మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పట్టించుకోవట్లేదు అన్నారు. మూడు వ్యవసాయ చట్టాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చి, దొడ్డి దారిన అవే చట్టాల అమలకు పూనుకుంటున్నారన్నారు. 60 రోజులకు పైగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జగజ్జీత్ దల్లేవాల్ దీక్షను విరమింప చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్లు ప్రవేశించే డిజిటల్ అగ్రి మిషన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ చట్టం కింద ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని, రూ.600 కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘం నాయకులు డి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, పోపూరి సుధీర్, కాపు వెంకట సుబ్బారావు, నల్లమోతు రాజేంద్ర, గొల్లపూడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు,కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలపై రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో సిఐటియు,రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు.గ్రంధాలయం సెంటర్ లో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష,కార్యదర్శి ఎం రవి,ఎం భాగ్యరాజు తదితరులు ఎర్రజెండాలు చేతబట్టి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని,లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్చి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పేరం బాబురావు,షేక్ జానీ, జె నరేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని : నల్ల చట్టాలని రద్దు చేయాలని ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పెదకాకానిలోని సుందరయ్య కాలనీ నుండి నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ రైతు మెడకు ఉరితాడులా కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలు చేసిందని దుయ్యబట్టారు. రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు అనుసరిస్తున్న తీరు శోచనీయం అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వ్యకాస, సిఐటియు నాయకులు ఉల్లంగుల శివయ్య, రాజా రమేష్ కె.సత్యనారాయణ,బి.సాంబయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, ఏ.నాగేశ్వరావు, జెట్టి.రాజలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : ఢిల్లీలో రైతుల దీక్షలకు మద్దతుగా స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలు రద్దు చేసినట్టు ప్రకటిస్తూ మళ్లీ అమలు జరపాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్ యోగేశ్వరరావు బి అమ్మిరెడ్డి సిహెచ్ పోతురాజు శ్రీనివాసరావు సుబ్బారావు శివయ్య శీను పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబురావు

సుబ్బారెడ్డికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజాశక్తి తాడేపల్లి పట్టణ విలేకరి, సుందరయ్య సేవా సమితి నిర్వాహకులు గాదే సుబ్బారెడ్డి ఇటీవల అనా రోగ్యానికి గురై, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు ఆదివారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో గాదే సుబ్బారెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, వేముల దుర్గారావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, డోకిపర్తి యోహాన్ తదితరులున్నారు.

ఏపీ ఎంఎస్ఆర్‌యు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గుంటూరు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికైంది. యూనియన్ జిలా మహాసభ ఆదివారం బ్రాడిపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ మెడికల్ రెప్రజెం టేటివ్ లు రాజ్యాంగ విశిష్టతను కాపాడుకోవడానికి కషి చేయా లని కోరారు. ఏపీ.ఎం.ఎస్.ఆర్. యూ రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్ .కుమార్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీల ప్రలోభాలకు బెదిరింపులకు మెడికల్ రిప్రెంటేటివ్ లు భయపడాల్సిన అవసరం లేదని వారికి అండగా బలమైన యూనియన్ ఉందని, ఆ యూనియన్ ని పటిష్ఠం చేసుకోవాల్సిన బాధ్యత మెడికల్ రెప్రజెంటేటివ్ ల మీద ఉందని తెలియ చేశారు. మహా సభలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.మల్లికార్జునరావు , సి.హెచ్. ఫణింద్ర కుమార్, ఉపాధ్యక్షులుగా రియాజ్, క్రిష్ణ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా, ఎన్. సీతారాం కోశాధికారిగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 48 మంది నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గుంటూరు : ఎస్ఎఫ్ఐ నూతన నగర కమిటీ ఎన్నికయింది. ఆదివారం బ్రాడీపేట లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నగర విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి నళినీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ప్రసంగించారు. అనంతరం నగర అధ్యక్ష కార్యదర్శులుగా నరేంద్ర, యశ్వంత్, ఉపాధ్యక్షులు షేక్ సుభాని, షంషీర్, భాను, మనోజ్ సహాయ కార్యదర్శులు రాజ్, రాకేష్, నాని, త్రినాథ్, గంగాధర్ సోషల్ మీడియా ఇన్చార్జ్ జాన్ రాజ్ లతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రానున్న రోజుల్లో గుంటూరు టౌన్ అభివృద్ధి కొరకు విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దిశగా ఈ కమిటీ పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్ తదితర విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎంసి ఆధ్వర్యంలో రిపబ్లిక్‌డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

మౌలిక వసతులు , అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిఎంసి ప్రధాన కార్యాలయం, జిన్నాటవర్ వద్ద, ఎన్‌టిఆర్ మున్సిలప్ స్టేడియంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం హిమని సెంటర్‌లోని మహాత్మాగాంధీ, లాడ్జ సెంటర్‌లో అంబేద్కర్, జి.యం.సి ప్రధాన కార్యాలయంలో బాబు రాజెంద్ర ప్రసాద్ చిత్ర పటానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, డిప్యూటి మేయర్ షేక్. సజీల, కార్పొరేటర్లు, విభాగా ధిపతులతో కలిసి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు గోనె లూదర్‌పాల్ మాట్లాడుతూ వందల సంవత్సరాలు అణచివేతకు గురైన వార్గాలు నేడు చదువుకొని, సమాజంలో నిలబడటానికి రాజ్యాంగమే కారణం అన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయటానికి ప్రయత్నిస్తున్న మతోన్మాదుల చేతుల నుండి పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆది నికల్సన్, షేక్.మస్తాన్‌వలి, ఆర్.పద్మనాభుడు, పి.మురళి, తరుణ్ పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో..

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారతదేశ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించేందుకు ముందుకు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విసి ఆచార్య కే . గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయం లో 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఇంచార్జ్ రెక్టర్ ఆచార్య కే.రత్న షీలా మణి అధ్యక్షత వహించారు. ముందుగా విసి ఆచార్య గంగాధరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ముఖ్య అతిథిగా ఆయన తన సందేశాన్ని ఇచ్చారు. స్వాతంత్రం సాధించినప్పటి నుంచి ఇప్పటివరకు 75 సంవత్సరాల లో ఎంతో దేశాభివృద్ధి జరిగిందన్నారు. మనం ప్రత్యేకంగా రూపొందించుకున్న రాజ్యాంగం లక్ష్యాలు, విధులను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాదికి గోల్డెన్ ఇండియా హెరిటేజ్ అండ్ డెవలప్మెంట్ అనే థీమ్‌తో గణతంత్ర వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం అనేది అందరికీ ఒకే విధంగా ఉన్నాయని కానీ కొన్ని అసమానతలు వాటిని దూరం చేసే విధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధులు స్వాతంత్ర్యం సాధించి పెట్టారని ఆ తర్వాత మేధావులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రచన జరిగిందన్నారు. మనం ఆయనను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ వేడుకల్లో కీలక ఉపన్యాసకులుగా పాల్గొన్న ఆచార్య రంగయ్యను వీసీ గంగాధర రావు, అధికారులు ఘనంగా సత్కరించారు.

220 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం లో 76 వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్షయ విద్యాలయం లో జెండా వందనం అనంతరం విద్యార్థులు స్వాతంత్ర్య పోరాట యోధులు వేషధారణల తో అలరించారు. విద్యార్థుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సరోజినీ విద్యాలయం పాఠశాల విద్యార్థులు మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిం చారు. శ్రీనివాస విద్యాలయం విద్యార్థులు 220 అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రత్తిపాడు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

చేబ్రోలు మండలంలో..

ప్రజాశక్తి - చేబ్రోలు : 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలను చేబ్రోలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ , తహశీల్దార్ కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రం , అన్ని గ్రామ పంచాయతీలు దగ్గర, అన్ని ప్రభుత్వ ఉన్నత , ప్రాథమిక ప్రైవేటు పాఠశాలలు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కుక్కిలిగడ్డ సాహితి కిరణ్ , ఎంపీటీసీలు, తహసిల్దార్ కె శ్రీనివాస్ శర్మ, ఇంచార్జ మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎ ఉమాదేవి, ఈవో పి ఆర్ అండ్ ఆర్ డి టి ఉషారాణి, ఎస్ ఐ డి వెంకటకష్ణ, విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పులి ప్రభుదాసు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మైలా రామరాజు, ఎం సి ఓ జి ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

'ఘన'తంత్ర సంబరం.. త్రివర్ణ శోభితం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గణతంత్ర వేడుకలను విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మహమ్మద్ షఫీ జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. లాంచీ స్టేషన్‌లో మేనేజర్ వినయతుల్లా, హరిత రిసార్ట్‌లో మేనేజర్ సురేందర్ రెడ్డి, ఎత్తిపోతలలో మేనేజర్ దత్తు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ డి.మేరీ మంజుల, ఏపీఆర్డీసిలో వైఎన్ఎస్ చౌదరి, ఏపీఆర్జేసిలో ప్రిన్సిపాల్ సరోజిని జాతీయ జెండాలను ఎగురవేశారు.

చిలకలూరిపేట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు ఎం.హుస్సేన్ జెండా ఎగురవేశారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుధ జాతీయ పతాక ఆవిష్కరణ గావించారు. ఏడో వార్డు కౌన్సిలర్ చెమిటిగంటి పార్వతీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాచేపల్లి : పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హై స్కూల్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, సచివాలయం, జనసేన, తెలుగుదేశం కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేశారు. ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కారంపూడి : మండల తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర నాయక్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గంట. శ్రీనివాసరెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వాసు, విద్యుత్ కార్యాలయంలో ఏఈ రామాంజనేయులు , శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ లో ప్లాంట్ ఇంచార్జి రాజేంద్ర ప్రసాద్, టిడిపి కార్యాలయంలో ఉన్నం లక్ష్మి నారాయణ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

అమరావతి : మండల తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. మండల తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహానుభావుల చిత్రపటాలకు నివాళు లర్పించారు.

ఈపూరు : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నళిని, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.ప్రభాకర రావు, ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎన్.రామకృష్ణారెడ్డి, పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈఈ ఎస్.గాంధీ బాబు జాతీయ జెండాను ఎగురవేశారు.

పల్నాడు జిల్లా : రొంపిచర్ల మండలంలో తహసీల్దార్ బి.నిర్మల, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.మ్యాథ్యూబాబు, పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ సి హెచ్ మణికృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుభానీ జాతీయ జెండా ఎగురవేశారు. నల్లగార్లపాడు గ్రామంలో డిబిహెచ్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

రెంటచింతల : ఎంపీడీవో, తహసీల్దారు, ట్రాన్స్‌కో, వివిధ పాఠశాలలు, కళాశాలల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొని జెండా వందనం గావించారు.

రాజుపాలెం: తహసీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ నెమలిపురి దుర్గేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కె.వేణుగోపాల్ జెండా వందనం గావించారు.

యడ్లపాడు : స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాజీ దేవాదాయ శాఖ అధికారి పోపూరి గంగయ్య చౌదరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సి.హెచ్.సృజన, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతకు కృషి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మహిళ సాధికారతయే తమ లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జరిగిన కార్యక్రమంలో 15 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. టైలరింగ్ ద్వారా వచ్చే ఆదాయంతో జీవనోపాధిని పెంచుకోవాలని క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ప్రోగ్రాం కన్వీనర్ పటాన్ నాగూర్ వలి అభిలాషించారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, కె.సి.పి హెచ్.ఆర్. గుడ్డేటి శ్రీనివాసరావు, తుమ్మల రాధ, కనక శ్రీ, చెరుకూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులకు అండగా ఉంటాం..

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకులు బేతంశెట్టి పెద్ద కొండలు గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆ కుటుంబానికి ఆదివారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా రూ.5 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో మాచర్ల జనసేన పార్టీ సమన్వయ కర్త బుస రామాంజనేయులు, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, వెల్దుర్తి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు గంధం మల్లయ్య, ఉపాధ్యక్షుడు తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తల మంచి కోరుకునే వ్యక్తి పవన్ కల్యాణ్ అని తెలిపారు. జనసైనికులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.

యోగ విజ్ఞాన సంఘం అధ్యక్షులుగా గోపీనాథ్

ప్రజాశక్తి -దాచేపల్లి

పట్టణంలోని యోగ విజ్ఞాన సేవ సంఘం అధ్యక్షులుగా యర్రంశెట్టి గోపీనాథ్ ఎన్నికయ్యారు. ఆదివారం యోగ కేంద్రం లో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలలో అధ్యక్షులుగా యర్రంశెట్టి గోపీనాథ్, ఉపాధ్యక్షులుగా అమరా పార్థసారథి, కార్యదర్శిగా తమ్మినేని అక్కిరాజు సంయుక్త, కార్యదర్శి బొడ్డు శేషగిరి, కోశాధికారి వంకాలపాటి బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా గోళ్ల శివ నాగేశ్వరరావు, కటికం మురళి, దేవరశెట్టి నాగేశ్వరరావు, భీమవరపు మాధవరెడ్డిలను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

ప్రజాశక్తి - క్రోసూరు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పీసపాడు గ్రామంలోని అన్ని పాఠశాలలో 5వ తరగతి చదువుచున్న విద్యార్థులకు గ్రామ పెద్దలు కంచేటి నరసింహారావు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. దీనిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఆదివారం నగదు బహుమతి అందజేశారు. హెచ్ఎంలు స్వర్ణలత, పి.పిచ్చయ్య, డి.వెంకటేశ్వర్లు, శివప్రసాద్, సర్పంచ్ ముత్తయ్య, ఎంపీటీసీ సభ్యులు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానాలకు..

ప్రజాశక్తి-పెదకూరపాడు

విద్య ద్వారానే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునని పెదకూరపాడు ఎంపీడీవో రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు రమేష్ అన్నారు. ఆదివారం పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మండల పరిధిలోని ఉద్యోగులకు కూడా ప్రోత్సాహక బహుమతులు అందించారు.

ఉత్తమ అధికారులకు ప్రశంసలు

ప్రజాశక్తి- మాచర్ల, ముప్పాళ్ల, రెంటచింతల, చిలకలూరిపేట, దాచేపల్లి, సత్తెనపల్లి రూరల్, విజయపురిసౌత్, ఈపూరు, యడ్లపాడు, సత్తెనపల్లి టౌన్, పిడుగురాళ్ల: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు అధికారులు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు స్వీకరించారు. మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, గృహనిర్మాణ శాఖ అధికారి మరియదాసు, ముప్పాళ్ల తహసీల్దారు ఎం.భవానీ శంకర్, అదే కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఈ.బ్రహ్మం, రెంటచింతల ఎంపీడీవో కె.సరోజినీ దేవి తదితరులు, చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, మున్సిపల్ టీపీవో బి.రాజేష్, సీఐ రమేష్, తహసీల్దారు షేక్ హుస్సేన్, ఎంఆర్ఐ షేక్ రమీజా, ఉమ్మడి గుంటూరు జిల్లా ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏజీపీ బగ్గి నరసింహారావు, సత్తెనపల్లిలో ఉత్తమ మండల వ్యవసాయ అధికారిగా ఎస్.శ్రీధర్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. దాచేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈపూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యదర్శి విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గానూ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ పర్వతినేని శ్రీధర్ ఉత్తమ అధికారిగా అవార్డు స్వీకరించారు. యడ్లపాడు మండలం జగ్గాపురం పశువైద్యశాలలో ఆఫీస్ సబార్డినేట్ గా విధుల నిర్వహిస్తున్న రేగళ్ల భూచక్రవర్తి కి పశుసంవర్ధక శాఖ తరపున ఉత్తమ సేవా ప్రశంసా పత్రంత అందుకున్నారు. కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ లావణ్య స్వీకరించారు. నకరికల్లు ఎస్సై చల్లా సురేష్ విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గానూ కలెక్టర్, ఎస్పీల చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని పొందారు. పెదకూరపాడు మండల తహసీల్దారు దానియేలు ఉత్తమ తహసీల్దారుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఇదే మండలంలో ఉత్తమ వ్యవసాయ సహాయకులుగా శేషుబాబు, ఎస్‌టిఓ కార్యాలయంలో మధుబాబు ప్రశంసాపత్రాలు దక్కించుకున్నారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. జలవనరులశాఖ డీఈ మురళీధర్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉద్యోగులు, అధికారులు అభినందించారు. విద్యుత్ శాఖ లో ఉత్తమ ప్రతిభ ను కనబరిచిన సందీప్‌కుమార్ నాన్ మానిటర్ అవార్డును సీపీడీసీఎల్ ఛైర్మన్ నుంచి అందుకున్నారు. 25 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్పకు కలెక్టర్ పి.అరుణ్ బాబు ఉత్తమ సేవా పురస్కార పత్రాన్ని అందించారు.





మువ్వన్నెల సంబరం

ప్రజాశక్తి-తెనాలి

వాడవాడలా మువ్వన్నెల సంబరం అంబరాన్ని తాకింది. గణతంత్ర వేడుకలతో జాతీయ జెండా రెపరెపలాడింది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపార కూడళ్లలో ఆదివారం నిర్వహించిన వేడుకలలో ఆయా శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొని జాతీయ జెండాకు వందనం సమర్పించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ట్రైనీ సహాయ కలెక్టర్ స్వప్నల్ పవార్ జగన్నాథ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కోర్టు భవనాల ప్రాంగణంలో అదనపు జిల్లా జడ్జి డి.శ్రీనివాసులు జెండా వందనం చేశారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వివేక్ వర్ధన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక చినరావూరులోని వాసిరెడ్డి లక్ష్మీపతి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

దుగ్గిరాల : గణతంత్ర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. తహసీల్దారు ఐ.సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వివేకానంద తదితరులు జెండా వందనం గావించారు.

మంగళగిరి : స్థానిక ఎస్ఎల్ఎం చైతన్య విద్యాసంస్థలలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ద్వారకానగర్‌లోని ఎస్ఎల్ఎం చైతన్య హై స్కూల్‌లో విశ్రాంత సైనిక అధికారి పి.కోటేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రైడెంట్ దంత వైద్యశాల అధినేత డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, పాఠశాల డైరెక్టర్ సిందే బాలకృష్ణ, ప్రిన్సిపాల్ సరళ కుమారి, వల్లభనేని వాణి, కృష్ణ ప్రసాద్, హెడ్ మినిస్ట్రేస్ సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ

ఘనంగా గణతంత్ర వేడుకలు

కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను కమిషనర్ ఎస్.ఆలింబాషా ఆవిష్కరించారు. ఏపీఎస్పీలో కమాండెంట్ నగేష్ బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాత మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను సొసైటీ చైర్మన్ ఎం.మోహన్ రావు ఆవిష్కరించారు. మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కె.జీవన్ సాగర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మార్కెట్ కమిటీ, సీటీవో, తహసీల్దారు, కోర్టుల ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదనందిపాడు: మండలంలోని తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ల్లో జాతీయ జెండా ఎగురవేశారు. లయన్స్ మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు చేశారు.

తుళ్లూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. రిపబ్లిక్ డే ప్రాధాన్యాన్ని వక్తలు వివరించారు.

కొల్లిపర : మండల కేంద్రమైన కొల్లిపాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఎస్సై కోటేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భీమవరం పద్మావతి జెండా ఎగురవేశారు. తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో టీడీపీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేశారు.

జెండాను ఎగురవేస్తున్న అధికారులు, ప్రముఖులు

రవాణారంగాన్ని దెబ్బ తీస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి-మంగళగిరి

రవాణా రంగాన్ని నమ్ముకుని ఉన్న వేలాది మంది ఉపాధికి గండికొట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో టి.శ్రీరాములు అధ్యక్షతన ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహనాల చట్టం సవరణ చేస్తూ, రవాణా శాఖ కార్యాలయాలను ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడాన్ని యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దేశంలో అతిపెద్ద రవాణా రంగంపై ఎంతోమంది కార్మికులు, వ్యాపారులు, ప్రజలు ఆధారపడి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వారందరికీ ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రవాణా రంగంలో మార్పులను వ్యతిరేకిస్తూ మార్చి 24వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో షేక్ కాజా, ఎం.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల దీక్షలకు 54 రోజులు..

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

తమకు రావలసిన నష్టపరిహారం కోసం ఏసీసీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 54వ రోజుకు చేరాయి. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో దీక్షలను కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, ఏఐఎఫ్టీయూ నాయకులు ఆదినారాయణ ప్రారంభించారు. దీక్షల్లో కె.వి.మోహన్ రావు, నందకుమార్, రామారావు, బల్ల అశోక్‌కుమార్, కె.ప్రసాద్ కూర్చొన్నారు.

సీపీఎం సీనియర్ నేత సతీమణి కన్నుమూత

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు మేకల పెద్దబ్బాయి (వెంకటేశ్వర్లు) సతీమణి సామ్రాజ్యం (79) ఆదివారం ఉదయం అనారోగ్యంతో ఆమె ఇంటి వద్ద కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల క్రితం సామ్రాజ్యం భర్త, వెంకటేశ్వర్లు వృద్ధాప్యంతో చనిపోయారు. సామ్రాజ్యం మరణ వార్త తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నాయకులు శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బొప్పన గోపాలరావు తదితరులు నివాళులర్పించారు. నాయకులు పల్లపాటి సుబ్బారావు, పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షులు అంకం కాళీకృష్ణ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మానసిక ఆరోగ్యంతో శారీరక సమస్యలు దూరం

ప్రజాశక్తి-తెనాలి

రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, హైదరాబాద్‌కు చెందిన నోవా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ కార్యాలయంలో సంతాన సాఫల్య కేంద్ర శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక ప్రశాంతత వల్ల ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందన్నారు. శారీరక వ్యాయామంతోపాటు అధిక బరువును నియంత్రించుకుంటే సంతానలేమి సమస్యలను అధిగమించవచ్చునన్నారు. సంతాన ప్రాప్తికి నిపుణులైన డాక్టర్ వై.స్వప్న వైద్య పరీక్షలు నిర్వహించి, తగు సలహాలు అందజేశారు. సమావేశంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

పదో తరగతి తెలుగు మీడియం విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మెటీరియల్‌ను స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పెదకూరపాడు ఎంపీడీవో రామకృష్ణ అందించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు , రాధాకృష్ణ పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

పలువురు అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - తెనాలి : గణతంత్ర వేడుకలలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు అందించే ఉత్తమ సేవా పురస్కారాన్ని తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకష్ణ అందుకున్నారు. గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో ఆదివారం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదగా ఆయన అవార్డును అందుకున్నారు. తహసీల్దార్ హెూదాలో ఇప్పటికీ వరుసగా మూడుసార్లు ఆయన ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు.

కొల్లిపర : గణతంత్ర వేడుకల సందర్భంగా కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ ఉత్తమ తహసీల్దారుగా ఎంపికయ్యారు. ఈ మేరకు జరిగిన జిల్లాస్థాయి వేడుకల్లో

కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

మంగళగిరి : మంగళగిరి పశువైద్యశాలను రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సౌజన్యంతో అభివృద్ధి పరిచిన వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీనివాసరావుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం లభించింది. రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్

అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని మాచర్ల మండలం విజయపురిసౌత్ ఫిల్టర్ హౌస్ వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాల మహానాడు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చింతమల్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు, టీడీపీ నేత కట్ట రాయప్ప మాట్లాడుతూ స్వతంత్రదేశానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచం గర్వించేలా రాజ్యాంగాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పగిడిపల్లి విజయ్, జనసేన పార్టీ స్థానిక అధ్యక్షులు, మాల మహానాడు నాయకులు రాహుల్, మీసాల వీరయ్య, చింతమల్ల యాకోబు, పత్తి రామ్ చందర్, చింతమల్ల చెన్నకేశవులు, దానయ్య, రాగిడి చంటి, రాయుడు రాజేష్ పాల్గొన్నారు.

వెల్దుర్తి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను

ఘనగా నిర్వహించారు. తహసీల్దారు బాషా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

(ప్రజాశక్తి - గుంటూరు)

ఘనంగా గణతంత్ర దినోత్సవం

గుంటూరు నగరంలోని పలు విద్యా సంస్థల్లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భాష్యం విద్యాసంస్థల్లో..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జాతీయ జెండాను భాష్యం చైర్మన్ రామకృష్ణ ఎగుర వేశారు. భాష్యం బ్లూమ్స్‌లో జరిగిన వేడుకల్లో కాటూరి మెడికల్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ జి.శిల్ప ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పిరమిడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సుమేధా హైస్కూల్లో..

స్థానిక ఎన్‌జిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ వీర రాఘవ ఆతుకూరి, స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి హై స్కూల్లో..



స్థానిక ఏటి అగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. స్కూల్ డైరెక్టర్ షేక్. హుస్సేన్ జాతీయ జెండాను ఎగురవేసి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిం చారు. పలు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షేక్. షంషాద్ భాను ప్రసంగించారు.

శ్రీవిద్య హైస్కూల్లో..

స్థానిక సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్య హైస్కూల్లో రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి జాతీయ జెండా ఎగరవేసి, ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శ్రీ విజేత హైస్కూల్లో..

స్థానిక ఏటి అగ్రహారంలోని శ్రీవిజేత హైస్కూల్లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో స్కూల్ డైరెక్టర్ సి.హెచ్ శ్రీహరిరావు జాతీయ జెండా ఎగురవేసి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ విద్యార్థులు పాల్గొన్నారు

ఉర్దూ హైస్కూల్లో..

స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్లో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి.ఖాసిం జాతీయ పతాకం ఎగురవేసి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన ఉపాధ్యాయులు, సిబ్బంది యండి.హసన్‌బేగ్, ఫెరోజ్, నాజిమాను సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కిట్స్ అక్షర్ కాలేజిలో

యనమదలలోని కిట్స్ అక్షర్ కళాశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ కోటయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు ప్రసంగించారు. ఎన్‌సిసి కేడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎన్‌సిసి విద్యార్థుల కవాతు ఆకట్టుకుంది. కవాతులో ప్రతిభ చూపిన కేడెట్స్‌కు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, సుబేదార్ మేజర్ విజయ్ మహతే, ఈ కార్యక్రమానికి వివిధ విభాగ అధిపతులు మరియు సుభేదార్ మేజర్ విజయ్ మహతే తదితరులు పాల్గొన్నారు.

టిజెపిఎస్ కాలేజీలో..

స్థానిక టిజెపిఎస్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.వి.కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. కృష్ణారావు, ప్రస్తుత సెక్రెటరీ కె.వి.బ్రహ్మం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో మెటల్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వెంకట నరసింహారావు, ట్రెజరర్ వి.కష్ణానంద్, కమిటీ సభ్యులు టి.మోహన్ రవికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థుల పెరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సెయింట్ ఆన్స్ కాలేజీలో..

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో గణతంత్ర దినోత్స వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ ప్రాము ఖ్యతను వివరించారు. విద్యార్థులు దేశభక్తి గేయాలు అల పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీ కాలేజీలో..

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో నిర్వహించిన వేడుకల్లో సిఆర్‌పిఎఫ్ పూర్వ డిఐజి వి.పురుషోత్తంరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఎగురవేశారు. కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఆర్.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి పురుషోత్తమరావు ప్రసంగించారు. ఎన్‌సిసి బి సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శ్రీమేధా కాలేజీలో..

స్థానిక కొత్తపేటలోని శ్రీమేధ లక్ష్మీభవన్ క్యాంపస్‌లో నిర్వహించిన గణ తంత్ర దినోత్స వేడుకల్లో శ్రీ మేధ డైరెక్టర్ అన్నా నందకిషోర్ జెండా ఆవి ష్కరణ చేసి, ప్రసంగి ంచారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ తిరు పతి స్వామి, ఎఓ లావణ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలపతి కాలేజీలో..

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి.ఆంజనేయులు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, డీన్ జె.లక్ష్మీనారాయణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ కాలేజీలో..

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిఎంసి సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.నాగమల్లేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో..

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అమర్ జవాన్ స్థూపానికి నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహిం చిన ర్యాలీ, ఎన్‌సిసి పరేడ్ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘు తదితరులు పాల్గొన్నారు.

విజేత ఐఐటి ఫౌండేషన్ స్కూల్లో..

గుంటూరులోని విజేత ఐఐటి ఫౌండేషన్ స్కూల్లో గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూల్ డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్ జండా వందనం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

శానిటేషన్ నిర్వహణకు ప్రత్యేక దృష్టి - ఆదాయం పెంపుతో వేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తితో గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరులో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటికే లీకేజీలన్నీ పూర్తిగా మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ నుంచి అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తా మన్నారు. గోరంట్ల నీటి పథకం పూర్తి చేసేందుకు మార్చి వరకు కాంట్రాక్టరుకు గడువు ఇచ్చామన్నారు. ఈ పథకం పూర్తి చేయడం వల్ల పలు ప్రాంతాలకు నీటి ఎద్దడి పరిష్కారం అవుతుందన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

శానిటేషన్ సమస్య ఎక్కువగా ఉంటోంది?

శానిటేషన్ సమస్యను పరిష్కరించేందుకు నగరం మొత్తాన్ని 802 మైక్రో పాకెట్లుగా విభజించాం. 32 శానిటరీ డివిజన్లనుంచి వర్కర్లు ప్రతి రోజు ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరిస్తారు. ఇందుకోసం 1604 మందిని ప్రత్యేకంగా కేటాయించాం. మొత్తం 2 వేల మందికి పైగా ఉండగా ఇందులో 1604 మంది ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణకు పనిచేస్తారు. అలాగే మేజర్ డ్రైన్లు శుభ్రపర్చడం, వీధులను శుభ్రపర్చడం వీరి బాధ్యతగా ఉంచాం. ఆటోల ద్వారా చెత్త సేకరణకు కొన్ని అడ్డంకులు ఉన్నాయి. 220 ఆటోలకు గాను 130 పని చేస్తున్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటు న్నాం. ప్రజలు ఎవ్వరూ చెత్తను రోడ్లపై కూడదు. రోడ్లపై బిన్స్ పెట్టకుండా కృషి చేస్తున్నాం.

రహదారుల అభివృద్ధికి ప్రణాళిక?

గత మూడు నెలల కాలంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో గుంతలు పూడ్చి రహదారుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అంతేగాక గతంలో మంజూరు అయి ఎన్నికల ముందు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి రహదారులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. రోడ్లతోపాటు సైడ్ కాల్వలు, డ్రైన్లను నిర్మించడం ద్వారా రోడ్లపై వర్షం నీరు కూడా నిలబడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు?

నగరంలో ప్రధానమైన శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే అనుమతులు వచ్చాయి. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలు, ఇతర సంస్థలతో చర్చలు జరిపాం. వారు స్వచ్ఛందంగా స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించారు. వీరికి టిడిఆర్ బాండ్లు ఇస్తాం. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక పనులు ప్రారంభం అయ్యాయి. మార్చి కల్లా ఆర్అండ్‌బికి స్థలం అప్పగించాల్సి ఉంది. ఈమేరకు కసరత్తు జరుగుతోంది. 120 అడుగుల వెడల్పుతో నాలుగు లైన్ల బ్రిడ్జి, సర్వీసు రోడ్డు ఉంటాయి.

ఆదాయం పెంపునకు చర్యలు?

నగరపాలక సంస్థ ఆదాయం పెంచడానికి ఒక ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రస్తుతం వసూలు అవుతున్న పన్నులతో పాటు బకాయిలు వసూలుకు చర్యలు చేపట్టాం. ఆస్తి పన్నుతోపాటు హోర్డింగ్‌ల ద్వారా రావాల్సిన ఆదాయంతో పాటు ఆశీలు వసూలు, బిల్డింగ్ ప్లాన్లు, షాపింగ్ కాంప్లెక్సులు, సైకిల్ స్టాండ్స్, టాయిలెట్స్ నిర్వహణ, వివిధ పద్దుల ద్వారా రావాల్సిన ఆదాయంపై దృష్టి పెడతాం. కార్పొరేషన్‌కు ఆదాయం పెంచడం ద్వారా అభివృద్ధి పనులను వేగిరపరుస్తాం. అలాగే కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగాన్ని అరికడతాం.

(ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి)